Eenadu

# 28 ఉద్యోగాలు...13,535 మంది అభ్యర్థులు

- **కమ్యూనికేషన్ ఎస్సై, ఎఫ్‌పీబీ ఎఎస్సై పోస్టులకు భారీగా దరఖాస్తులు**

**ఈనాడు, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ పోలీసు కమ్యూనికేషన్ విభాగంలో ఎస్సై, వేలిముద్రల విభాగం (ఎఫ్‌పీబీ) ఎఎస్సై పోస్టులకు భారీగా పోటీ నెలకొంది. ఈ రెండు విభాగాల్లో కలిపి మొత్తం 28 పోస్టులకు ఆగస్టు 24వ తేదీన ఏపీ పోలీసు నియామక మండలి ప్రకటన జారీ చేసింది. దీనికి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆదివారం సాయంత్రం 5 గంటలతో ముగియగా, ఆ సమయానికి మొత్తం 13,535 దరఖాస్తులందాయి. ఈ లెక్కన ఒక్కో పోస్టుకు 483 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. దరఖాస్తుదారుల్లో 12,357 మంది పురుషులు కాగా, 1178 మంది మహిళలనున్నారు. విద్యార్హతల వారీగా చూస్తే 76.45 శాతం మంది బీఎస్సీ, బీకాం, బీఏ వంటి సంప్రదాయ డిగ్రీ కోర్సులు పూర్తి చేసిన వారే ఉన్నారు. నాలుగు శాతం మంది బీటెక్ వంటి వృత్తి విద్యాకోర్సులు, 12.79 శాతం మంది పీజీ చదివిన వాళ్లు ఉన్నారు. నాలుగేళ్ల విరామం తర్వాత నోటిఫికేషన్ రావడంతోపాటు, రెండేళ్ల వయోపరిమితి సడలింపు ఇవ్వడంతో పోటీ అధికంగా నెలకొంది.

**13 నుంచి శారీరక దారుఢ్య పరీక్షలు:** ఈ ఉద్యోగాలకు సంబంధించి శారీరక దారుఢ్య, శారీరక సామర్థ్య పరీక్షలు అక్టోబరు 13వ తేదీ ఉదయం ఆరు గంటల నుంచి మంగళగిరి పటాలంలో ప్రారంభం కానున్నాయి. మహిళా అభ్యర్థులకు మాత్రం అక్టోబరు 17వ తేదీ ఉదయం ఏడు గంటల నుంచి ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. వీటికి సంబంధించిన కాల్‌లెటర్‌ను అభ్యర్థులు సోమవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి పోలీసు రిక్రూట్‌మెంట్ వెబ్‌సైట్ ద్వారా పొందొచ్చని ఏపీ పోలీసు నియామక మండలి ఛైర్మన్ అతుల్‌సింగ్ తెలిపారు. ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు apsl-prb.pc@gmail.com కు మెయిల్ ద్వారా ఆ సమాచారం తెలియజేయాలని సూచించారు.